హామీలన్నీ నీటి మూటలేనా..!

- 100 రోజులు పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం
- కొల్లేరు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేనా?
- అటవీశాఖ మంత్రి ఒక్కసారైన కొల్లేరు వచ్చారా? అని ఎన్నికల సమయంలో పవన్ ప్రశ్న
- ఎన్నికల తర్వాత అటవీశాఖ మంత్రిగా పవన్ కల్యాణ్
- కైకలూరు ప్రజలను వీడని డంపింగ్ యార్డు స్థల సమస్య



కైకలూరు తాలూకా సెంటర్‌లో ఎన్నికల విజయభేరి సభలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్, చిత్రంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ (ఫైల్)

కైకలూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయింది. ఎన్నికల వేళ విజయమే పరమావధిగా ఎడాపెడా వాగ్దానాలు నేతలు గుప్పించారు. కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా పోటీపడిన కామినేని శ్రీనివాస్ ఎన్నికల వేళ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్తవి నిర్మిస్తామన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటా నన్నారు. ఏలూరు నుంచి కైకలూరు వచ్చే క్రమం లో ప్రారంభంలో చెత్తతో కైకలూరు ఆహ్వానిస్తోం దని, త్వరగా డంపింగ్ యార్డు సమస్యను రూపు మాపుతానని హామీ ఇచ్చారు. ప్రధానంగా కొల్లేరు ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపుతానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అంది స్తామన్నారు. ఇప్పుడు కొల్లేరు లంక గ్రామాల్లో వాటర్ టిన్ను రూ.35కు కొనుగోలు చేస్తున్నారు. కొల్లేరులో చేపల, రొయ్యల చెరువుల వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. అక్కడ ప్రజలకు ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా సమీప పశ్చి మగోదావరి జిల్లాల నుంచి నీటి సరఫరా చేయాల్సి ఉంది. కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపుతానని కామినేని ఎన్నికల్లో పదేపదే హామీ ఇచ్చారు. మరోపక్క ఇటీవల వరదలకు కొల్లేరు పొంగి గ్రామాలను ముంచెత్తింది. ఉప్పుటేరు సమస్య పరిష్కారంపై స్పష్టమైన నిర్ణయాన్ని ప్రక టించాల్సి ఉంది.

పవన్ కల్యాణ్ ఏమన్నారంటే..

ఎన్నికల సమయంలో బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ విజయం కోసం మే 5వ తేదీన కై కలూరు తాలూకా సెంటర్‌లో జనసేన అధ్య క్షుడి హోదాలో పవన్ కల్యాణ్ విజయభేరి సభ నిర్వహించారు. ఇప్పటి వరకు అటవీశాఖ మం త్రిగా ఉన్న పెద్దిరెడ్డి ఒక్కసారైన కొల్లేరు ప్రాం తాన్ని సందర్శించారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు అదే అటవీశాఖకు పవన్ మంత్రిగా ఉన్నారు. ఇటీవల ముంపు ప్రాంతాలను మం త్రి పవన్ సందర్శిస్తే ప్రజల బాధలు అర్థమ య్యేవని పలువురు అంటున్నారు. ఒడిశాలో పక్షుల కేంద్రాలను పర్యాటకశాఖ అభివృద్ధి చేసిందని, ఇక్కడ పక్షుల కేంద్రాలను అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పిస్తామని పవన్ చె ప్పారు. ప్రస్తుతం పక్షుల కేంద్రం 20 రోజులుగా ముంపునీటిలో నానుతోంది. కైకలూరు నియో జకవర్గానికి మరో అగ్నిమాపక కేంద్రం, ధాన్యం గోడౌన్, ముదినేపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కైకలూరులో ఈఎస్ఐ ఆస్పత్రి, కలిదిం డిలో రైతుబజారు, పెదలంకలో గరిసిపూడి రెగ్యులేటర్ నిర్మాణం పూర్తి, కైకలూరు పంచా యతీని మున్సిపాలిటీగా మార్పు అనే వాగ్దా నాలు చేశారు. కూటమి 100 రోజుల పాలనలో ఇప్పటి వరకు వాగ్దానాలు కార్యరూపం దాల్చ లేదు. దీంతో హామీలన్నీ నీటి మూటలేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పవన్‌కల్యాణ్ కొల్లేరు అంశం కేంద్ర పరిధిలో ఉందని, అందుకే బీజేపీ అభ్యర్థి కామినేనిని గెలిపిస్తే సమస్యలు పరిష్కా రమవుతాయన్నారు. కొల్లేరు కాంటూరు కుదిం పు అంశంపై కామినేని కేంద్రాన్ని ఒప్పించి ప్రజల ఆశలను నెరవేర్చుతారని కొల్లేరు ప్రజలు వేచిచూస్తున్నారు.

హామీ నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో కైకలూరు ప్రచారానికి వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్డీయే కూటమి గెలిస్తే ముదినేపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. హామీని వెంటనే నెరవేర్చి మాట నిల బెట్టుకోవాలి.

– జి.లక్ష్మి, లింగాల గ్రామం

అస్తవ్యస్తంగా రహదారులు



రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. నేషనల్ హైవే గుంతలతో కూనరిల్లుతోంది. చిన్నపాటి వర్షానికే గుంతలలో వర్షం నీరు నిలిచి వాహనచోదకులు, ప్రజలు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. రోడ్లు అభివృద్ధి చేసి హామీలను నెరవే ర్చాలి.

– పెరుమాళ్ల సత్యనారాయణ, పెరికెగూడెం

రోడ్లను అభివృద్ధి చేయాలి



ఎన్నికల ప్రచారంలో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తే నియోజకవర్గంలోని రహదారులను అభివృద్ధి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ముదినేపల్లి మండలం వడాలి నుంచి కైకలూరు మండలం తామరకొల్లు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారి రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీని అభివృద్ధికి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– వి.రవికుమార్, చినకామనపూడి

కార్మికులకు న్యాయం చేయాలి



ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులను అన్నివిధాలా ఆదుకుంటామని కైకలూరు ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. కార్మికులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి.

– ఎస్.సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మికుడు, లింగాల

ప్రయాణం నరకప్రాయం

రహదారులపై ఉన్న పెద్ద గుంతలతో అవస్థలు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం రాక ముందు చేసిన హామీలు అమలు చేసిన దాఖలాలు లేవు. రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా ఉంది. రహదారులను అభివృద్ధి చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలి.

– మన్నేపల్లి ఆదాం, మండవల్లి

క్లుప్తంగా

రేపు ఉచిత మెగా వైద్యశిబిరాలు

గుడివాడరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) గుడివాడశాఖ ఆధ్వర్యంలో ఇటీవల వరదల వలన నష్టపోయిన రుద్రపాక, రామాపురం, పుట్టగుంట గ్రామాల్లో ఈనెల 22వ తేదీన ఏకకాలంలో మెగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఐఎంఏ గుడివాడశాఖ అధ్యక్ష, కార్యదర్శులు పాలడుగు వెంకట్రావ్, పిన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆయా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వైద్య శిబిరంలో పిల్లల నుంచి పెద్దలకు సంబంధించిన చర్మ, షుగర్, ముక్కు, చెవి, గొంతు, కండరాలు, ఎముకలు, దంతాలు, ఇతర వ్యాధులకు సంబంధించి వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ముదినేపల్లి రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జాస్మిన్ తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న సివిక్స్ సబ్జెక్టుకు సంబంధించి అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టుకు ఎంఏ అర్హత ఉండి, కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 24వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 95539 62884లో సంప్రదించాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతి



పమిడిముక్కల: మామిళ్లపల్లి మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆముదాలపల్లి వెంకటేశ్వరరావు(77) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వరరావు భార్య కూడా సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం కుమారుడు సుబ్రమణ్యం సర్పంచ్‌గా ఉన్నారు. సౌమ్యుడిగా పేరొందిన వెంకటేశ్వరరావు మృతిపై మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

ఆకుకూరలతో పోషక లోపాల సవరణ

ముదినేపల్లి రూరల్ : గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలతో పోషకలోపాల సవరణ జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గర్భిణులు ఇతర ఆహారాలతో పాటు ఆకుకూరలు ఆహారంలో ఎక్కువ భాగం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణకు ప్రతిఒక్కరూ ఏయే ఆహారాలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు తరచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు పిచ్చియ్యకు సత్కారం



మండవల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు సీహెచ్ పిచ్చియ్యను మండలంలోని అయ్యవారిరుద్రవరం ఎంపీపీ పాఠశాల్లో సర్పంచ్ బోనం శేషగిరి, ఉప సర్పంచ్ ఇంటి నాగరాజు, ఎంపీటీసీ నాని, ఎస్ఎంసీ చైర్మన్ విజయశాంతి శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నాగబాబు, ఉపాధ్యాయులు, బెన్నీపాల్, రూప్‌కుమార్, బలరాం, శోభారాణి, జయశ్రీ పాల్గొన్నారు.

'హెల్త్ గురూ'తో ఆరోగ్యాన్ని కాపాడుకోండి

గుడ్లవల్లేరు: ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారాన్ని అందించేందుకు హెల్త్ గురూ పేరిట గుడ్లవల్లేరు ఎస్‌బీఐ ఎదుట శుక్రవారం కిచెన్‌ను ప్రారంభించారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు పండ్లు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసే జ్యూసెస్, సలాడ్స్‌ను ఉదయం బ్రేక్‌ఫాస్ట్, సాయంత్రం స్నాక్స్‌గా అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్యకర ఆహారం కోసం తమ వద్దకు వచ్చే కస్టమర్లకు యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు, ప్రొటీన్లు, ఫైబర్, కొవ్వు కలయికతో రోగనిరోధక శక్తిని పెంపొందించే ఆహారాన్ని మాత్రమే అందించటం తమ హెల్త్ గురూ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఉపాధి పనులకు రూ.10.27 కోట్లు



పామర్రు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గత ఏడాది నిర్వహించిన పనులు, వాటి విలువలపై సామాజిక తనిఖీ వేదికను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 2,120 పనులను నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 3.56లక్షల పని దినాలతో కూలీలు పనులు చేశారన్నారు. ఈ పనులకు రూ.10.27 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ పీడీ జీవీ సూర్యనారాయణరావు, డ్వాక్రా కార్యాలయం ఏఓ మహేష్, పామర్రు వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ వై రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాల అదనపు గది ప్రారంభం

నెమ్మలూరు(పామర్రు): పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని నెమ్మలూరు శివారు మలయప్పన్న పేటలోని ప్రాథమిక పాఠశాల అదనపు గదిని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించి వారికి నాణ్యమైన భోజన సదుపాయాలను సమకూర్చుతున్నామన్నారు. నేటికీ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా పాఠశాల గదిని ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, సర్పంచ్ నూకల గోపాలం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, పామర్రు ఎంఈఓ–2 పద్మవాణి పాల్గొన్నారు.

వన్నేరు డ్రెయిన్ గండ్లు పూడ్చకపోతే ఎలా?

ఎమ్మెల్యేను ప్రశ్నించిన రైతులు

మోపర్రు (పెదపారుపూడి): ఇటీవల కురిసిన వర్షాలకు వన్నేరు, బుడమేరు డ్రెయిన్లకు గండ్లుపడి వేలాది ఎకరాల నీట మునిగిపోయినా ఇంత వరకు డ్రెయిన్ల కట్టలు పూడ్చకపోతే ఎలా అని మోపర్రు రైతులు ఎమ్మెల్యే కుమారరాజాను ప్రశ్నించారు. మండలంలోని మోపర్రులో మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతుండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంబంధించి నీళ్లు ఇళ్లలోనే ఉన్నాయని, పంట పొలాలు ఎందుకూ పనికి రాకుండా పోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నష్టపరిహారం త్వరగా వచ్చేలా చేయాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన అధికారులతో నష్టపరిహారం వివరాలు ఎంత వరకు పూర్తి చేశారో అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భిణులకు సీమంతాలు ఆయన చేతుల మీదుగా చేశారు. అనంతరం నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రంగారావు, ఎంపీడీఓ టీ సీతామహాలక్ష్మి, జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, మండల నాయకులు పొలిశెట్టి సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, నాయకులు బుజ్జి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమారరాజా

వరద బాధితులకు సాయం అభినందనీయం

కైకలూరు: వరద బాధితులను ఆదుకోడానికి ఆర్థిక సాయం చేస్తున్న ప్రతిఒక్కరూ అభినందనీయులని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు కార్నర్ స్టోన్ ఒకేషనల్ కాలేజీ విద్యార్థులు ప్రజల నుంచి సేకరించిన రూ.30 వేలను కామినేనికి శుక్రవారం అందించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మరో రూ.30 వేలు విజయవాడలో నేరుగా బాధితులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.రామారావు, కూటమి నేతలు పెన్మత్స త్రినాథరాజు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం కైకలూరు తహసీల్దారు కార్యాలయం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. అటవీశాఖ రేంజర్ రామలింగాచార్యులు, డీఆర్వో జయప్రకాష్, కూటమి నేతలు కొల్లి బాబి, పూలా రాజీ పాల్గొన్నారు. కలిదిండి మార్కెట్ యార్డ్‌లో విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో ఇటీవల ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. మండవల్లి మండలం లోకుమూడి ఏలూరురోడ్డులో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా అన్నసమారాధనలో పాల్గొన్నారు. కైకలూరు ట్రావెల్స్ బంగ్లావద్ద వ్యవసాయశాఖాధికారుల ఆధ్వర్యంలో వ్యవసాయ పోస్టర్‌ను కామినేని ఆవిష్కరించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

టీవీ చానల్ రిపోర్టర్ ఆత్మహత్య

గుడివాడరూరల్: గుడివాడ సాక్షి చానల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న పడిదరపు ఉమామహేశ్వరరావు (43) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పట్టణంలోని పాటిమీద జగన్నాథ టవర్స్‌లో నివాసం ఉంటున్న మహేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనిమీద బయటకు వెళ్లిన భార్య వచ్చి చూసే సరికి ఉరి వేసుకుని వేలాడుతూ కన్పించాడు. దీంతో వెంటనే ఆమె చుట్టు పక్కల వారికి సమాచారం అందించగా హుటాహుటిన ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మహేష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వన్‌టౌన్ ఎస్ఐ పి.గౌతమ్‌కుమార్ సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గుడివాడ పరిసర ప్రాంతాల్లోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఉమామహేష్ ఇంటికి చేరుకుని, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతి బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని పేర్కొన్నారు.



మహేష్ (ఫైల్)

అమ్మ పేరుతో మొక్క నాటండి

మండవల్లి: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా అమ్మపేరుతో ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ శుక్రవారం స్థానిక సచివాలయంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గోసాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి శుక్రవారం గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వణుకూరుకు చెందిన పోతురాజు డ్రైవర్‌గా పని చేస్తాడు. అతడికి భార్య సరిత ఇద్దరు పిల్లలు. అతను ఉదయం గోసాల సెంటర్ రోడ్డు దాటుతుండగా కంకిపాడు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న కారు ఢీ కొట్టింది. దీంతో పోతురాజు తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. బాధితుడ్ని విజయవాడలో ఆస్పత్రికి తరలించారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'పొలం పిలుస్తోంది' పోస్టర్ విడుదల

మండవల్లి: ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా శుక్రవారం పొలం పిలుస్తోంది పోస్టర్‌ను విడుదల చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, మండవల్లి, ముదినేపల్లి వ్యవసాయాధికారులు ఎస్‌కే జరీనా, బి.వేణుమాధవ్ మాట్లాడుతూ 24వ తేదీ నుంచి ప్రతి మంగళ, బుధవారాల్లో అన్ని గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పేరేచర్ల ప్రసాద్‌రాజు, బోయిన శీను, ఎఈ శ్రీను, విష్ణు పాల్గొన్నారు.

కొండిపర్రులో స్వచ్ఛతా హి సేవ



కొండిపర్రు(పామర్రు): పామర్రు మండలం కొండిపర్రు గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదార్ల వెంబడి, కూడళ్ల వద్ద, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అక్టోబరు రెండో తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమలలో అందరూ పాల్గొనాలని నాయకులు తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు నూకారపు వీరాంజనేయులు, విజయకుమార్, సువర్ణరాజు, చిరంజీవి, సుకుమార్, సత్యం, ఈశ్వరరావు, సురేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కైకలూరు: విద్యార్థి దశ నుంచి యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ గ్రేడ్–1 సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా కైకలూరు మాతా స్కూల్లో కిషోరబాలికలకు పోషకాహర విలువలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆకుకూరల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మధుర, సైదాని, జెస్సీ పాల్గొన్నారు.

అన్నసమారాధన

కలిదిండి(కైకలూరు): వినాయక చవితి మహోత్సవాల ముగింపు సందర్భంగా పలు చవితి పందిర్ల వద్ద అన్నసమారాధన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలిదిండి మండలం గోపాలపురం మారెమ్మ చెట్టు వద్ద వరసిద్ధి వినాయక పందిరి వద్ద 700 మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు వాకాని ధనరాజు, పరసా ప్రసాద్, మనోజ్‌కుమార్, ఉప సర్పంచ్ వాకాని నాగ సుబ్రహ్మణ్యం, నాగలక్ష్మి, కోటేశ్వరరావు, అంజనాదేవీ పాల్గొన్నారు.



గోపాలపురంలో అన్నసమారాధన

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని గుడ్లవల్లేరు పంచాయతీ ఎదుట శ్రీ లక్ష్మీ బైక్ మెకానిక్ వర్క్స్ అధినేత చుక్కల ఉపేంద్ర ఆధ్వర్యంలో యువకులు శుక్రవారం రాత్రి రెండు వేల మంది భక్తులకు భారీ అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ చేతుల మీదుగా చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

మహోన్నత నటుడు అక్కినేని



గుడివాడలో ఏఎన్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ పొట్లూరి

ఘనంగా ఏఎస్ఆర్ శతజయంతి ఉత్సవాలు

గుడివాడరూరల్: తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నత నటుడు స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు అని విశ్వభారతి స్కూల్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. స్థానిక విశ్వభారతి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఏఎన్ఆర్ శతజయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఏఎన్ఆర్ నటించిన చలనచిత్రాల్లోని పాటలను విద్యార్థులు ఆలపించగా మరికొందరు విద్యార్థులు నృత్య ప్రదర్శనలు నిర్వహించి అందరినీ అలరించారు. ఏఎన్ఆర్ జ్ఞాపకాలను గుర్తు తెస్తూ ఆయన నటించిన చిత్రాల్లోని పలు సన్నివేశాలను విద్యార్థులందరికీ కళ్లకు కట్టేలా ప్రదర్శించారు. ఏఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఏఎన్ఆర్ నటుడిగా కాకుండా విద్యను ప్రోత్సహించే వ్యక్తిగా తనకు తెలుసునన్నారు. 1993 నుంచి విశ్వభారతి విద్యా సంస్థల వ్యాప్తికి ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు అమూల్యమైనవని పేర్కొన్నారు. నటుడిగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సొంతగడ్డ అయిన గుడివాడ పరిసర ప్రాంతాలపై ఆయనకు ఎనలేని ప్రేమ ఉందన్నారు. వైజ్‌వుడ్స్ స్కూల్ ప్రారంభోత్సవానికి ఆయన ఇచ్చిన తోడ్పాటు మరువలేనిదన్నారు. ఏఎన్ఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, అంకిత భావంతో ముందుకు వెళ్లి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్నారు. విశ్వభారతి పాఠశాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన ఏఎన్ఆర్ విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో పాఠశాలలో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.



పామర్రులో ఏఎన్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాపీఠం సభ్యులు

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను మొవ్వ మండలం కూచిపూడి–పెదపూడి ప్రధాన కూడలిలో శుక్రవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ విష్ణువర్ధనరావు, అయ్యంకి ఆనందరావు, ప్రభాకరరావు, రాజులపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలను స్థానిక హితమ్ స్కూల్లో ఘంటసాల కళాపీఠం వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాపీఠం అధ్యక్ష,కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, నందిపాటి హేమంత్ రెడ్డి, ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల తదితరులు పాల్గొన్నారు.

బస్సు అద్దాలు పగలగొట్టిన వ్యక్తి అరెస్ట్

కంకిపాడు: మద్యం తాగి బస్సును అడ్డగించి బస్సు అద్దాలు పగలగొట్టిన వ్యక్తిని కంకిపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు..వన్నే విష్ణువర్ధన్‌రావు ఆర్టీసీ డ్రైవరు. ఈనెల 19వ తేదీ సాయంత్రం గుడివాడ డిపో నుంచి విజయవాడకు బస్సు నడుపుతూ వస్తుండగా కోమటిగుంట లాకుల వద్ద మద్యం తాగి ఉన్న వడ్డె క్రాంతి బస్సును అడ్డగించి బస్సు అద్దాలు పగలగొట్టాడు. ఆర్టీసీ డ్రైవరు విష్ణువర్ధన్‌రావును తీవ్రంగా దుర్భాషలాడాడు. డ్రైవరు ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం కేసు నమోదు చేసిన పోలీసులు బస్సు అద్దాలు పగలగొట్టిన క్రాంతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.